

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించడానికి వెళ్తున్న టీజీ భరత్



పోలింగ్ ప్రశాంతం

- జిల్లాలో 75.83 శాతం నమోదు
- పలు చోట్ల మొరాయించిన ఈవీఎంలు, కంట్రోల్ యూనిట్లు
- ఈవీఎంలలో అభ్యర్థుల భవితవ్యం

కర్నూలు, మే 13 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో కీలకమైన పోలింగ్ ఘట్టం ప్రశాంతంగా సోమవారం ముగిసింది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది. భగభగమండే సూర్యుడి ప్రతాపంతో భూమి అగ్ని గోళంగా మారినప్పటికీ తెల్లవారుజాము నుంచి కురిసిన వర్షానికి వాతావరణం చల్లబడింది. ఆరు గంటల నుంచే పోలింగ్ కేంద్రాలు వద్ద బారులు తీరి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 75.83 శాతం పోలింగ్ నమోదైంది. అత్యధికంగా మంత్రాలయంలో 84.51 శాతం.. అత్యల్పంగా ఆదోనిలో 63.51 శాతం పోలింగ్ నమోదైంది. ఎన్నికల సంఘం పకడ్బందీ ఏర్పాట్లు.. పోలీసుల భారీ బందోబస్తు వెరసి ఎలాంటి ఘర్షణలు లేకుండా ఓటర్లు తమ ఓటు హక్కు సద్వినియోగం చేసుకున్నారు. సాయంత్రం ఆరు గంటల్లోగా క్యూలైన్లలో ఉన్న వారందరికీ ఓటు వేసేందుకు అవకాశం ఇవ్వడంతో పలు పోలింగ్ కేంద్రాల్లో రాత్రి 11 గంటల వరకు పోలింగ్ జరిగింది. ఎన్నికల జనరల్ అబ్జర్వర్ జాఫర్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు డాక్టర్ జి.సృజన, ఎస్పీ జి.కృష్ణకాంత్ పోలింగ్ తీరును, బందోబస్తును సమీక్షిస్తూ.. ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా పకడ్బందీ చర్యలు తీసుకున్నారు.



సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జిల్లాలో కర్నూలు లోక్‌సభ స్థానం సహా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, నంద్యాల పార్లమెంట్ పరిధిలోని పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గానికి సోమవారం పోలింగ్ జరిగింది. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు జి. సృజన నేతృత్వంలో ఎస్పీ జి.కృష్ణకాంత్ భద్రతా పర్యవేక్షణలో ప్రశాంతంగా ఎన్నికలు జరిగాయి. 20,54,563 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోవడానికి 2,204 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పురుష ఓటర్లు 10,13,794, మహిళలు 10,40,451 మంది ఉన్నారు. థర్డ్ జండర్ ఓటర్లు 318 ఉన్నారు. 18-19 ఏళ్ల కలిగిన యువ ఓటర్లు 56,067 ఉంటే.. వీరు తొలిసారి ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రత్యేక అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవడానికి వీలుగా 2204 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ప్రజల్లో చైతన్యం కల్పించారు. 2019 ఎన్నికల్లో 75.87 శాతం పోలింగ్ నమోదు కాగా.. ఈ ఎన్నికల్లో 74.17 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కావాల్సి ఉంటే.. పలు కేంద్రాల్లో కంట్రోల్ యూనిట్లు, ఈవీఎంలు మొరాయించడంతో అర గంట ఆలస్యంగా ప్రారంభమైంది.



కుటుంబ సమేతంగా ఓటింగ్



ఓటు వేసిన మహిళలు

ఉదయం బారులు తీరారు: తెల్లవారుజాము నుంచి కురిసి వర్షాలకు వాతావరణం చల్లబడడంతో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు ఉదయమే చేరుకున్నారు. ప్రతి రెండు గంటలకోసారి పోలింగ్ శాతం విడుదల చేశారు. ఉదయం 9 గంటలకు సగటున 9.61 శాతం నమోదైంది. అంటే.. 1,97,445 మంది ఓటు వేశారు. ఆ సమయానికి అత్యల్పంగా కోడుమూరు నియోజకవర్గంలో కేవలం 5.10 శాతం నమోదు కావడం కొసమెరుపు. 11 గంటలకు 22.05 శాతం నమోదైంది. మధ్యాహ్నం ఒంటి గంటకు 38 శాతం నమోదు కాగా.. సాయంత్రం 3 గంటలకు 52.26 శాతం నమోదైంది. ఆ సమయానికి 10.74 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అత్యధికంగా మంత్రాలయం నియోజకవర్గంలో 84.51 శాతం, అత్యల్పంగా ఆదోని నియోజకవర్గంలో 63.51 శాతం నమోదైంది.

ఓటుకు కోసం పోటెత్తిన నారీలోకం

ఆయా నియోజకవర్గాల్లో జరిగిన పోలింగ్ సరళిని బట్టి చూస్తే ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవడానికి నారీమణులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఉదయమే వారు పోలింగ్ కేంద్రాలు వద్ద బారులు తీరారు. మహిళా ఓటర్లు 10,40,451 ఉంటే మెజార్టీగా 75-80 శాతం ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారని ఎన్నికల అధికారుల అంచనా.

ఓటు వేసేందుకు యువత ఆసక్తి: కొత్తగా ఓటు వచ్చిన 18-19 ఏళ్ల యువత ఓటు హక్కు నియోగించుకోవడానికి ఆసక్తి చూపారు. పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు. గుంటూరు, విజయవాడ, హైదరాబాదు వంటి ప్రాంతాల్లో చదువుకుంటున్న యువత, బెంగళూరు, హైదరాబాదు, చెన్నై వంటి నగరాల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్న యువకులు పెద్ద సంఖ్యలోనే ఆదివారం తమ స్వగ్రామాలకు చేరుకున్నారు. సోమవారం క్యూలైన్లలో నిలబడి ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాల్లో సెల్ఫీలు దిగి.. మై ఓట్.. ఓట్ ఫర్ బెటర్ ఫీచర్ (నా ఓటు.. నా మంచి భవిష్యత్తు కోసం) అంటూ సోషల్ మీడియాలో పోస్టు చేయడమే కాకుండా.. మిత్రులకు ఫోన్ చేసి తొలిసారిగా ఓటు వేశానంటూ ఓటు వేసిన ఆనందం పంచుకోవడం కొసమెరుపు. వృద్ధులు సైతం అధిక సంఖ్యలో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పరిశీలన

ఎన్నికల నిర్వహణ తీరు, ఆయా నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద పరిస్థితిని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు జి.సృజన, ఎస్పీ జి.కృష్ణకాంత్, ఎన్నికల జనరల్ అబ్జర్వర్ జాఫర్ వెబ్‌కాస్టింగ్ ద్వారా పరిశీలించారు. వివిధ పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను వీక్షిస్తూ.. ఎన్నికలు జరుగుతున్న తీరును సమీక్షించారు. ఎప్పటికప్పుడు ఎన్నికల అధికారులకు సూచనలు చేస్తూ ప్రశాంతంగా పోలింగ్ జరిగేలా పకడ్బందీ చర్యలు తీసుకున్నారు.

ఈవీఎంలలో అభ్యర్థుల భవితవ్యం

కర్నూలు లోక్‌సభ సహా ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు 184 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. వివిధ కారణాలతో 50 నామినేషన్లు తిరస్కరించగా.. 12 మంది ఉప సంహరించుకున్నారు. 121 మంది అభ్యర్థులు పోటీకి సై అన్నారు. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా 56 రోజులు విస్తృత ప్రచారం చేశారు. చివరి రెండు రోజులు పోలింగ్ వ్యూహాలు అమలు చేశారు. సోమవారం ఓటర్లు తీర్పు వెలువరించారు. అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమైంది. జూన్ 4న అభ్యర్థులు భవితవ్యం తేలిపోతుంది. రాయలసీమ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలకు ఈవీఎంలు చేరాయి. టీడీపీ కూటమి, వైసీపీ, కాంగ్రెస్ సహా బరిలో ఉన్న అభ్యర్థులు, రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. ఇన్నాళ్లు జైకొట్టిన ఓటర్లు ఏ పార్టీకి మొగ్గు చూపారో..? ఏ అభ్యర్థికి మద్దతు ఇచ్చారో..? చట్టసభలకు ఎవరిని పంపుతారో..? ఏ ఇద్దరు కలిసినా పోలింగ్ సరళిపై చర్చించుకోవడం కనిపిస్తోంది. అంతేకాదు.. ఇతర జిల్లాలో ఉన్న మిత్రులు, బంధువులకు ఫోన్లు చేసి మీ జిల్లాలో పోలింగ్ ఎలా జరిగింది..? ఏ పార్టీకి గెలుస్తుంది..? రాష్ట్రం ప్రభుత్వం ఏర్పాటు చేసేది ఎవరు..? అంటూ ఆరా తీస్తున్నారు. గెలుపై ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నా.. ఓటరన్న ఎవరికి పట్టం కడతారో తేలాలంటే... జూన్ 4 వరకు ఉత్కంఠ తప్పదు.







ఓటు వేసిన కలెక్టర్ జి.సృజన, జేసీ నారపురెడ్డి మౌర్య, ఎస్పీ కృష్ణకాంత్ దంపతులు





మూడు ఎన్నికల్లో పోలింగ్ శాతం ఇలా

నియోజకవర్గం	2014	2019	2024
కర్నూలు	58	59.53	63.87
పాణ్యం	72	74.41	74.09
పత్తికొండ	79	83.97	84.14
కోడుమూరు	75	79.52	76.50
ఎమ్మిగనూరు	74	79.16	81.80
మంత్రాలయం	78	84.98	84.51
ఆదోని	65	65.31	63.51
ఆలూరు	76	79.71	82.77
మొత్తం	**79.37**	**75.87**	**75.83**

గంటల వారీగా నమోదైన పోలింగ్ శాతం

నియోజకవర్గం	ఉ.7-9	ఉ.9-11	ఉ.11-1	మ.1-3	ఫైనల్
కర్నూలు	10.2	19.10	36.09	47.79	63.87
పాణ్యం	7.76	23.05	40.05	51.08	74.09
పత్తికొండ	10.3	21.80	36.41	58.82	84.14
కోడుమూరు	5.1	21.65	34.92	53.18	76.50
ఎమ్మిగనూరు	11.02	21.12	33.05	49.73	81.80
మంత్రాలయం	13.45	26.93	42.63	55.36	84.51
ఆదోని	7.16	20.48	36.04	48.06	63.51
ఆలూరు	11	23.05	44.73	55.62	82.77
జిల్లా సగటున	**9.34**	**22.05**	**38.00**	**52.26**	**75.83**

ఓటు వేసిన డీఐజీ విజయరావు

కర్నూలు మే 13: స్థానిక బీ. క్యాంపులోని సిల్వర్ జూబ్లీ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో సోమవారం కర్నూలు రేంజ్ డీఐజీ సీహెచ్ విజయరావు తన సతీమణితో కలిసి ఓటు వేశారు.



ఓటు వేసిన డీఐజీ విజయరావు దంపతులు

ఓటు హక్కు వినియోగించుకున్న కలెక్టర్, ఎస్పీలు

కర్నూలు(కలెక్టరేట్),: నగరంలో సోమవారం ఇందిరాగాంధీ మెమోరియల్ మున్సిపల్ హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.జి.సృజన, సిల్వర్ జూబ్లీ కళాశాల పోలింగ్ కేంద్రంలో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే స్థానిక కొత్తపేటలోని సెయింట్ జోసెఫ్ విద్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ తన సతీమణితో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

కర్నూలులో ఓటేసిన ప్రముఖులు



ఓటు వేసిన టీజీ వెంకటేశ్ కుటుంబ సభ్యులు





ఓటు వేసి వస్తున్న టీడీపీ అభ్యర్థులు గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి టీజీ భరత్, బస్తిపాటి నాగరాజు, బొగ్గుల దస్తగిరి

ఘర్షణలు.. తోపులాటలు

- పలుచోట్ల స్వల్ప ఉద్రిక్తత
- కర్నూలు ఉస్మానియా కాలేజీలో దొంగ ఓట్లు వేసే ప్రయత్నం
- అడ్డుకున్న టీడీపీ శ్రేణులు
- మల్లెపల్లిలో ఓటు వేసి వచ్చేందుకు వ్యక్తిపై దాడి
- కల్లూరు అర్బన్ వార్డుల్లో వైసీపీ యువ నాయకుడు హల్‌చల్


కర్నూలు ఉస్మానియా కాలేజీలో టీడీపీ వైసీపీ నాయకుల మధ్య వాగ్వాదం

కర్నూలు, మే 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్వల్ప ఘర్షణలు.. వాగ్వాదాలు చోటు చేసుకున్నాయి. సోమవారం కర్నూలు లోక్‌సభ స్థానంతో పాటుగా ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికలు జరిగాయి. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. మధ్యాహ్నం తరువాత పలు చోట్ల వైసీపీ నాయకులు, కార్యకర్తలు గొడవలకు దిగారు. కర్నూలు అర్బన్‌లో ఉస్మానియా కాలేజీలో వైసీపీ శ్రేణులు దొంగ ఓట్లు వేస్తుండడంతో టీడీపీ కార్యకర్తలు అడ్డుకున్నారు. దీంతో ఇరు వర్గాల మధ్య తోపులాట, వాగ్వాదం జరిగింది. చివరకు పోలీసులు లాఠీలకు పని చెప్పాల్సి వచ్చింది. పాణ్యం నియోజకవర్గం కల్లూరు అర్బన్ వార్డుల్లో వైసీపీ యువ నాయకుడు కాటసాని శివనరసింహారెడ్డి పలు చోట్ల హల్‌చల్ చేశారు. ముజఫర్ నగర్‌లో ఓ పోలింగ్ కేంద్రంలో టీడీపీ, వైసీపీ అభ్యర్థులు గౌరు చరిత, కాటసాని రాంభూపాల్‌రెడ్డి బైఠాయించడంతో ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. పోలీసులు జోక్యం చేసుకొని వారిద్దరిని అక్కడి నుంచి పంపించేశారు.

● జిల్లాలో చోటు చేసుకున్న సంఘటనలు:

● ఎమ్మిగనూరు నియోజకవర్గంలో ఎమ్మిగనూరు పట్టణం శ్రీనీలకంఠేశ్వరస్వామి జడ్పీ హైస్కూల్‌లో ఏడు పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వైసీపీ కౌన్సిల్ ఇషాక్, టీడీపీ మాజీ కౌన్సిలర్ ఖలీముల్లా మధ్య వాగ్వాదం జరిగింది. పోలీసుల జోక్యంతో సద్దుమణిగింది. నాగులదిన్నె గ్రామంలో టీడీపీ నాయకుడిపై వైసీపీ నాయకులు చెప్పుతో దాడికి దిగారు. ఎమ్మిగనూరు మండలం దేవిబెట్ట గ్రామంలో ఓ ప్రభుత్వ ఉద్యోగి (వైసీపీ సర్పంచి వెంకట్రామిరెడ్డి కుమారుడు) పోలింగ్ కేంద్రం వద్ద పలు మార్లు లోపలికి బయటికి తిరగడంతో టీడీపీ కార్యకర్తలు అడ్డుకున్నారు. దీంతో వాగ్వాదం జరిగింది.

● ఆలూరు నియోజకవర్గంలో ఆలూరు పట్టణం మండల పరిషత్ మెయిన్ స్కూల్‌లో ఐదు పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వైసీపీ కార్యకర్తలు టీడీపీ కార్యకర్తలపై దౌర్జన్యానికి దిగారు. టీడీపీ కార్యకర్తలు కూడా తిరగబడడంతో తోపులాట జరిగింది. పోలీసులు లాఠీచార్జి చేశారు. ఆస్పరి మండలం కారుమంచి గ్రామంలో ఓ మహిళ ఓటు విషయంలో వైసీపీ కార్యకర్తలు పోలింగ్ అధికారితో వాగ్వాదానికి దిగి పోలింగ్ కేంద్రం ముందు బైఠాయించారు.

● ఆదోని పట్టణం టీజీఎల్ కాలనీలో వైసీపీ నాయకులు ఫ్యాన్‌కు ఓటు వేయమని చెబుతుండడంతో టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఓటరు స్లిప్పులపై ఎమ్మెల్యే వైసాయిప్రసాద్‌రెడ్డి ముద్రించడం ఎన్నికల నిబంధనలకు విరుద్ధమని మున్సిపల్ కమిషనర్ రాంమోహన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

● కర్నూలు అర్బన్ ఉస్మానియా కళాశాల ఆవరణలో 9 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. పోలింగ్ కేంద్రం 140, 141లో వైసీపీ కార్యకర్తలు సైక్లింగ్ ద్వారా దొంగ ఓట్లు వేస్తుండడంతో.. టీడీపీ ఏజెంట్లు అడ్డుకున్నారు. వాగ్వాదం జరిగింది. టీడీపీ ఏజెంట్లపై దాడికి ప్రయత్నిస్తూ వైసీపీ కార్యకర్తలు చుట్టుముట్టడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. గొడవకు కారణమైన ఓ వైసీపీ కార్యకర్తను పోలీసులు జీపులో ఎక్కించి స్టేషన్‌కు తీసుకెళ్తుండగా ఆ జీపును ముట్టడించి జీపుపై దాడికి దిగారు. దీంతో పోలీసులు లాఠీలకు పని చెప్పాల్సి వచ్చింది. విషయం తెలుసుకున్న టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ అక్కడికి చేరుకొని దొంగ ఓట్లను ఎలా ప్రోత్సహిస్తారని, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తానని ఆగ్రహం వ్యక్తం చేశారు.

● పాణ్యం నియోజకవర్గం కల్లూరు అర్బన్‌లోని పలు వార్డుల్లో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తనయుడు కాటసాని శివనరసింహారెడ్డి హల్‌చల్ చేశారు. వీకర్ సెక్షన్ కాలనీలోని 41వ వార్డులో తెలుగు మహిళా నంద్యాల జిల్లా అధ్యక్షురాలు కె.పార్వతమ్మ, ఆమె తనయుడు శివ పోలింగ్ కేంద్రం సమీపంలో ఉన్నారు. ఆ సమయంలో అక్కడికి వచ్చిన కాటసాని శివ నరసింహారెడ్డి మీరు ఇక్కడేం చేస్తున్నారని ప్రశ్నించడంతో వాగ్వాదం జరిగింది. పోలీసులు వచ్చి సర్దిచెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది. గణేష్ నగర్‌లోని 180 పోలింగ్ కేంద్రం వద్ద కూడా కాటసాని శివనరసింహారెడ్డి ఆధ్వర్యంలో దొంగ ఓట్లు వేస్తున్నారని టీడీపీ శ్రేణులు ఎదురు తిరగడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణ ఏర్పడింది. రాళ్లు వేసుకునే పరిస్థితి ఏర్పడింది. ఈ ఘటనను ఓ వ్యక్తి సెల్ ఫోన్లో చిత్రీకరిస్తుంటే.. వైసీపీ నాయకుడు ఆ సెల్ లాక్కొని డిలీట్ చేశారని టీడీపీ నాయకులు ఆరోపించారు. ముజఫర్ నగర్ జడ్పీ హైస్కూల్‌లో ఓ పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్యే కాటసాని భార్య ఉమామహేశ్వరమ్మ ఉందని తెలిసి టీడీపీ అభ్యర్థి గౌరు చరిత, ఆమె కుమారుడు గౌరు జనార్దన్‌రెడ్డి అక్కడి చేరుకున్నారు. వైసీపీ అభ్యర్థి ఎమ్మెల్యే కాటసాని కూడా వచ్చారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు ఇద్దరిని అక్కడి నుంచి పంపించేశారు.

● పత్తికొండ నియోజకవర్గం వెల్దుర్తి మండలం మల్లెపల్లి గ్రామంలో హైదరాబాదులో ఉంటున్న టీడీపీ మద్దతుదారుడు భాష్యంరాజు ఓటు వేసేందుకు స్వగ్రామానికి వచ్చాడు. ఓటు వేసి సమీపంలోని చిన్నాన్న ఇంటికి వెళ్లగా.. వైసీపీ కార్యకర్తలు దాడి చేయడంతో భాష్యంరాజు తలకు బలమైన గాయాలయ్యాయి. ఐదుగురు వైసీపీ కార్యకర్తలపై పోలీసులు కేసు నమోదు చేశారు. పత్తికొండ పట్టణం పోలింగ్ కేంద్రం 55 వద్ద టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది.

ముజఫర్ నగర్‌లో ఉద్రిక్తత

కర్నూలు/కల్లూరు, మే 13: కల్లూరు అర్బన్ 32వ వార్డు ముజఫర్ నగర్‌లో సోమవారం సాయంత్రం నుంచి రాత్రి దాకా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇక్కడ పోలింగ్ ప్రక్రియ ఆలస్యం కావడంతో ఓటర్లు భారీ ఎత్తున క్యూలైన్‌లో ఉన్నారు. అయితే బైరెడ్డి శబరి కాటసాని శివనరసింహారెడ్డి, కాటసాని ఉమామహేశ్వరమ్మ, కాటసాని రాంభూపాల్ రెడ్డి, గౌరు జనార్దన్ రెడ్డి, గౌరు చరితమ్మ అక్కడకు చేరుకోవడంతో అసలు ఏం జరుగుతుందోనన్న ఆందోళనకరమైన వాతావరణం నెలకొంది. పోలీసులు వీరిని ఎవరిని బయటకు పంపాలో అర్థంగాక అయోమయంలో ఉండిపోయారు. నాలుగో పట్టణ సీఐ శంకరయ్య, ఎస్ఐలు సునీల్, మోహన్ కిషోర్ రెడ్డిలు ప్రత్యేక దళాలతో అక్కడకు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. కాటసాని రాంభూపాల్‌రెడ్డికి, గౌరు చరితలకు సర్ది చెప్పడంతో వారి ఇద్దరు వెళ్లిపోయారు. రాత్రి 8 గంటల వరకు ఈ బూత్‌లో పోలింగ్ ప్రక్రియ సాగింది.


తోపులాడుకుంటున్న వైసీపీ, టీడీపీ కార్యకర్తలు

ఇరువర్గాల మధ్య మాటల యుద్ధం

- కేకలు, ఈలలతో దద్దరిల్లిన రుద్రవరం ● రంగంలోకి దిగిన పోలీసులు


రుద్రవరంలో గుమిగూడిన వైసీపీ కార్యకర్తలు

రుద్రవరం, మే 13: రుద్రవరంలోని 263, 265 పోలింగ్ కేంద్రాలు ఎంపీయూపీ మెయిన్ పాఠశాలలో నిర్వహించారు. ఓ ఏజంటుకు, ఒక వ్యక్తికి మధ్య మాటా మాటా పెరిగి ఘర్షణకు దారి తీసింది. ఇరువర్గాల కార్యకర్తలు, నాయకులకు సమాచారం అందించారు. ఒక వైపు ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రరెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ గంధం రాఘవరెడ్డి, గంగుల విజయసింహారెడ్డి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి అలా దాడి చేస్తే ఎలా అని ప్రశ్నించారు. మరో వైపు ఆళ్లగడ్డ టీడీపీ యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి ఇరిగెల బ్రదర్స్ రాంపుల్లారెడ్డి, సూర్యనారాయణరెడ్డి రుద్రవరం చేరుకున్నారు. ఇరిగెల రాంపుల్లారెడ్డి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి జరిగిన సంఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇరువర్గీయులు గుమికూడడంతో కేకలు ఈలలు మాటల యుద్ధం కొనసాగింది. పోలీసులు రంగంలోకి దిగి ఇరువర్గాలను 50 మీటర్ల దూరంలో అడ్డుకున్నారు. ఏం జరుగుతుందోనని రుద్రవరం ప్రజలు భయాందోళన చెందారు. పోలీసులు ఇరువర్గాలకు నచ్చజెప్పడంతో సమస్య సద్దుమణిగింది.

ఎస్పీ పోలీసు సిబ్బందిపై ఎస్పీ సీరియస్

రుద్రవరంలో ఇంత జరుగుతున్నా తనకెందుకు సమాచారం ఇవ్వలేదని ఎస్పీ రఘువీర్ రెడ్డి పోలీసు సిబ్బంది, ఎస్పీ సిబ్బందిపై సీరియస్ అయ్యారు. సోమవారం సాయంత్రం రుద్రవరం గ్రామాన్ని సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇరువర్గాలపై కేసు నమోదు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఆళ్లగడ్డ డీఎస్పీ షర్ఫుద్దీన్, సిబ్బంది ఉన్నారు.


రుద్రవరం: పోలింగ్ కేంద్రం ఆవరణలో ఎమ్మెల్యే బిజేంద్రరెడ్డి ఇలా..

ఓటు వేసేందుకు వచ్చి.. మృత్యువాత

- పోలింగ్ బూత్‌లోనే.. ● మాధవరంలో విషాదఛాయలు


ఈరన్న (ఫైల్)

మంత్రాలయం, మే 13: మంత్రాలయం మండలం మాధవరం గ్రామానికి చెందిన తెలుగు పంది ఈరన్న (62) అనే వ్యక్తి ఓటేసేందుకు వచ్చి పోలింగ్ బూత్‌లోనే మృతి చెందాడు. ఈ సంఘటన సోమవారం మధ్యాహ్నం జరిగింది. ఈరన్న మాధవరంలో ప్రాథమిక పాఠశాలలో పోలింగ్ బూత్ నెం.53లో ఓటేసేందుకు గంటల తరబడి క్యూలో నిల్చున్నాడు. అప్పటికే తోటి ఓటర్లతో కళ్లు తిరుగుతున్నాయని చెప్పాడు. ఓటు వేసి బయటకు వస్తుండగా స్పృహ తప్పి పడిపోయాడు. అక్కడే ఉన్న ఎన్నికల సిబ్బంది, గ్రామ ప్రజలు ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేస్తుండగా పోలింగ్ బూత్‌లోనే మృతి చెందాడు. గంటల తరబడి క్యూలో నిల్చుండడం, ఉదయం అల్పాహారం సైతం తినకుండా క్యూలో నిల్చుండటంతో అస్వస్థతకు గురై మృతి చెంది ఉంటాడని బంధువులు ఆరోపిస్తున్నారు. మృతునికి ఒక కొడుకు, కూతురు ఉన్నారు. బంధువులు రోదిస్తున్న దృశ్యం పలువురిని కంటతడి పెట్టించింది.

ఆదోని ఎమ్మెల్యేపై కేసు నమోదు

- ఎమ్మెల్యే ఫొటో ఉన్న ఓటర్ స్లిప్పుల పంపిణీ
- ఎన్నికల అధికారులు సీరియస్



ఆదోని, మే 13: ఆదోని వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డిపై రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఓటర్లకు ప్రలోభాలు గురి చేసేలా ఓటర్ స్లిప్పులపై ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి ఫొటో ముద్రించి ఓటర్ స్లిప్పులను ఓటర్లకు పంపిణీ చేశారు. దీనిపై ఎన్నికల సంఘం సీరియస్ అయింది. దీంతో ఎన్నికల నియమావళి ఉల్లంఘన కింద ఆయనపై కేసు నమోదు చేసినట్లు సీఐ గోపినాథ్ తెలిపారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సందర్శించిన డీఐజీ



ఆళ్లగడ్డ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన కర్నూలు రేంజ్ డీఐజీ సీహెచ్ విజయరావు

నంద్యాల క్రైం, మే 13 : సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో భాగంగా పలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను కర్నూలు రేంజ్ డీఐజీ సీహెచ్ విజయరావు సందర్శించారు. సోమవారం ఆళ్లగడ్డ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల, వైపీపీఎం ఉన్నత పాఠశాల తదితర సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఎన్నికల ప్రత్యేక పోలీసు పరిశీలన అధికారి హిమాన్ష్ శంకర్ త్రివేది, నంద్యాల ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డిలతో కలిసి డీఐజీ సందర్శించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చే సిన బందోబస్తు, క్యూలైన్లను పరిశీలించారు. అనంతరం డీఐజీ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అల్లర్లు జరగకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఓటర్లను క్యూలైన్లలో పంపించాలని, వంద మీటర్ల పరిధిలో ఎవరూ గుంపులుగా ఉండకుండా చూసుకోవాలని, సెల్ ఫోన్లతో ఓటర్లను పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతించరాదని అన్నారు. పోలింగ్ తర్వాత ఈవీఎం బాక్స్‌లను స్ట్రాంగ్‌రూముల్లోకి చేర్చే వరకు అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని డీఐజీ విజయరావు ఆదేశించారు.


పోలీసులతో మాట్లాడుతున్న నంద్యాల ఎస్పీ రఘువీర్‌రెడ్డి

విద్యుదాఘాతంతో రైతు మృతి

చిప్పగిరి, మే 13: చిప్పగిరి గ్రామానికి చెందిన రైతు కొండా వెంకటేష్ (45) విద్యుదాఘాతంతో సోమవారం మృతి చెందాడు. ఉదయం వర్షం కురుస్తుండడంతో ఇంటి పైకప్పు పై నిలిచిన నీటిని తొలగించడానికి వెళ్లి కరెంట్ షాక్‌కు గురై మృతి చెందాడు. మృతునికి భార్య, వికలాంగుడైన ఒక కుమారుడు, నలుగురు ఆడపిల్లలు ఉన్నారు.

పిడుగుపాటుతో యువకుడి మృతి

చిప్పగిరి, మే 13: చిప్పగిరిలో పిడుగుపాటుకు గురై సురేష్ (26) అనే యువకుడు సోమవారం మృతి చెందాడు. ఎద్దులపాకలో నిద్రిస్తున్న కొనకొండ్ల సురేష్‌పై రాత్రి పిడుగు పడటంతో మృతి చెందినట్లు తండ్రి సుంకన్న తెలిపారు.

పెట్నికోటలో ఉద్రిక్తత

వైసీపీ, టీడీపీ శ్రేణుల మధ్య ఘర్షణ

ఇరువర్గాలకు చెందిన పలువురికి గాయాలు


పోలింగ్ బూత్ వద్ద మోహరించిన కార్యకర్తలు


పోలీసులతో వాగ్వాదానికి దిగిన టీడీపీ శ్రేణులు

కొలిమిగుండ్ల రూరల్, మే 13: మండలంలోని పెట్నికోట గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామ పంచాయతీలోని నాయినిపల్లె పోలింగ్ బూత్-16 నుంచి టీడీపీకి చెందిన మహిళా ఏజెంట్‌ను వైసీపీ వారు బయటికి పంపారని టీడీపీ శ్రేణులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకొని వాగ్వాదానికి దిగాయి. దీంతో సీఐ గోపినాథ్‌రెడ్డి అక్కడికి చేరుకొని ఇరువర్గాలను చెదరగొట్టారు. అనంతరం పెట్నికోట గ్రామంలో వివాదం నెలకొంది. జడ్పీ చైర్మన్ సోదరుడు ఎర్రబోతుల ఉదయ్‌భాస్కరరెడ్డి 13-పోలింగ్ బూత్‌లోకి వెళ్లాడని టీడీపీ శ్రేణులు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా పోలీసులు టీడీపీ శ్రేణులపై చేయి చేసుకోవడం మరింత ఉద్రిక్తతకు దారితీసింది. పోలీసులు వైసీపీ అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ టీడీపీ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. ఎర్రబోతుల ఉదయ్‌భాస్కరరెడ్డిని బూత్ నుంచి పంపించాలంటూ నిరసన చేపట్టారు ఈ సందర్భంగా ఇరువర్గాలు బాహాబాహీకి దిగి ఒకరిపై మరొకరు రాళ్లు రువ్వుకున్నారు. ఈ దాడుల్లో టీడీపీకి చెందిన ఆరుగురు గాయాలు కాగా వైసీపీకి చెందిన వారికి గాయాలయ్యాయి. దీంతో పోలింగ్ నిలిచి పోవడంతో ప్రత్యేక పోలీసు బలగాలు అక్కడికి చేరుకొని, ఎర్రబోతుల ఉదయ్‌భాస్కరరెడ్డిని అక్కడి నుంచి పంపించివేశారు. తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులతో సుమారు గంట పాటు పోలింగ్ నిలిచిపోయింది. తిరిగి పోలింగ్ ఆలస్యంగా ప్రారంభం కావడంతో రాత్రి 9గంటల వరకు అధికారులు పోలింగ్ కొనసాగించారు.

ఎస్ఐ రామిరెడ్డి అత్యుత్సాహం

- పోలింగ్ స్టేషన్ వద్ద టీడీపీ నాయకులు, కార్యకర్తలపై జులుం
- ఎర్రగుడి సర్పంచ్ లక్ష్మీదేవిపై దురుసు ప్రవర్తన
- ఎదురుతిరిగిన గ్రామస్థులు, టీడీపీ కార్యకర్తలు

బనగానపల్లె రూరల్, మే 13: బనగానపల్లె పోలీస్‌స్టేషన్ ఎస్ఐ రామిరెడ్డి అత్యుత్సాహంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలపై జులం ప్రదర్శిస్తూ రెచ్చిపోయారు. మండల పరిధిలోని ఎర్రగుడి గ్రామంలో సోమవారం మధ్యాహ్నం సమయంలో పోలింగ్ కేంద్రం వద్దకు వచ్చిన ఎస్ఐ రామిరెడ్డి ఒక్కసారిగా ఆవేశంతో రెచ్చిపోయి చుట్టూ పక్కల ఉన్న టీడీపీ నాయకులు, కార్యకర్తలపై లాఠీ ఝులిపించారు. మహిళ అని కూడా చూడకుండా ఎర్రగుడి సర్పంచ్ లక్ష్మీదేవిని పోలింగ్ కేంద్రం వద్ద నుంచి వెళ్లిపోవాలని దురుసుగా మాట్లాడటంతో పక్కనే ఉన్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎస్ఐకి ఎదురుతిరిగారు. మరోసారి ఎస్ఐ తనదైన శైలిలో రెచ్చిపోయి వారిని ఇష్టానుసారంగా తిడుతూ వైసీపీ పట్ల తన స్వామి భక్తిని చాటుకున్నారు. వైసీపీ నాయకుల మెప్పు పొందేందుకే తమ పట్ల ఎస్ఐ దురుసుగా ప్రవర్తిస్తూ టీడీపీ కార్యకర్తలపై ఎస్ఐ దాడి చేశాడని సర్పంచ్ లక్ష్మీదేవి ఆరోపించారు. పోలింగ్ కేంద్రం వద్ద టీడీపీ కార్యకర్తలతో పాటు వైసీపీ వారు కూడా ఉన్నారని, అయితే వైసీపీ కార్యకర్తలను ఏమీ అనకుండా టీడీపీ నాయకులు, కార్యకర్తలనే టార్గెట్ చేయడం ఎంతవరకు సమంజసమని ఆమె ప్రశ్నించారు.

ఇండిపెండెంట్ అభ్యర్థి కారు అద్దాలు ధ్వంసం

బుగ్గన వర్గీయులపై కేసు నమోదు


వైసీపీ వర్గీయుల దాడిలో పగిలిన కారు అద్దం

బేతంచెర్ల, మే 13: డోన్ అసెంబ్లీ ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసిన రిటైర్డు డీఎస్పీ పీఎస్ బాబు కారు అద్దాలను మంత్రి బుగ్గన వైసీపీ వర్గీయులు ధ్వంసం చేశారు. పీఎస్ బాబు వివరాల మేరకు.. పీఎస్ బాబు బేతంచెర్ల మండలంలోని వివిధ గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. ఈ క్రమంలోనే కొలుములపల్లె నుంచి బేతంచెర్లకు కారులో వెళ్లాడు. మంత్రి బుగ్గన పల్లెలకు వెళ్లి తిరిగి ఇంటికి బయలుదేరాడు. అయితే బుగ్గన కారును పీఎస్ బాబు కారు వెంబడించిందని పట్టణంలో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి స్వగృహం వద్ద అడ్డుకున్నారు. అనంతరం పీఎస్ బాబు కారు అద్దాలను ధ్వంసం చేశారరు. ఈ విషయంపై మంత్రి బుగ్గన, చలం రెడ్డి, నాగురాజులతోపాటు మరో 30 మంది కార్యకర్తలపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పీఎస్ బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రియతమ్ రెడ్డి తెలిపారు.

టీడీపీ కార్యకర్తపై వైసీపీ దాడి



వెల్దుర్తి, మే, 13: మండలంలోని మల్లెపల్లె గ్రామంలో టీడీపీ కార్యకర్త భాష్యం రాజుపై వైసీపీ కార్యకర్తలు సోమవారం కర్రలతో దాడి చేశారు. భాష్యం రాజు ఉద్యోగరీత్యా హైదరాబాదులో ఉంటున్నాడు. సొంతూరు మల్లెపల్లెలో ఓటు హక్కు వినియోగించుకోవడానికి వచ్చాడు. ఓటు హక్కు వినియోగించుకొని తన చిన్నాన్న ఇంటికి వెళ్లాడు. వైసీపీ కార్యకర్తలు ప్రచారం చేస్తున్నాడనే నెపంతో కర్రలతో దాడి చేశారు. విషయం తెలుసుకున్న సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డిలు గ్రామానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు. గాయపరిచిన వ్యక్తులపై కేసు నమోదు చేశారు.

ఏయ్.. ఏమనుకుంటున్నావ్..?

- ఎస్ఐకి ఎమ్మెల్యే శిల్పా వార్నింగ్
- దేవనగర్‌లో స్వల్ప ఉద్రిక్తత


నంద్యాలలో ఎస్ఐపై ఆగ్రహంతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల (నూనెపల్లె), మే 13: నంద్యాలలోని ఓ పోలింగ్ కేంద్రం వద్ద ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి ఎస్ఐపై రెచ్చిపోయాడు. పోలింగ్ కేంద్రంలోకి వెళ్లకుండా అడ్డుకోవడంతో దురుసుగా ప్రవర్తించాడు. నంద్యాలలోని దేవనగర్‌లో ఉన్న పురపాలక పాఠశాల కేంద్రానికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఏవీఆర్ ప్రసాద్, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, టీడీపీ నాయకుడు డాక్టర్ రవికృష్ణ వచ్చారు. ఎన్నికల పాసులను చూపించడంతో వారిని లోపలికి అనుమతించారు. అదే సమయంలో పోలింగ్ సరళిని పరిశీలించేందుకు ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి అతని అనుచరులతో వచ్చాడు. శిల్పా తన అనుచరులతో గుంపులుగా పోలింగ్ కేంద్రంలోకి రావడంతో ఎలా అనుమతిస్తారంటూ పోలీసులను టీడీపీ నేతలు ప్రశ్నించారు. దీంతో ఇరువర్గాల మధ్య మాటల యుద్ధం జరిగింది. దీంతో ఇతర ప్రాంతం నుంచి ఎన్నికల విధులకు వచ్చిన ఓ ఎస్సై ఇరువర్గాలకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలోనే ఎమ్మెల్యే శిల్పా రవి, ఎస్ఐకి వాగ్వివాదం చోటుచేసుకుంది. దీంతో ఎమ్మెల్యే శిల్పా రవి 'ఏయ్ ఎవరనుకుంటున్నావు... ఏమనుకుంటున్నావ్... గుర్తు పెంటుకుంటానని' ఆ ఎస్ఐకి వార్నింగ్ ఇచ్చాడు. ఆ తరువాత టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తాతిరెడ్డి తులసిరెడ్డి అక్కడికి రావడంతో మాటామాటా పెరిగి స్వల్ప ఉద్రిక్తతకు దారి తీసింది. ఘటనా స్థలానికి త్రీటౌన్ సీఐ నరసింహులు, బీఎస్ఎఫ్ సిబ్బంది చేరుకుని చెదరగొట్టారు.


ఓటు వేసేందుకు క్యూలైన్‌లో ఉన్న ఓటర్లు

మాక్ పోల్‌ను పరిశీలించిన కలెక్టర్



మాక్ పోల్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్

కర్నూలు(కలెక్టరేట్), మే 13: కర్నూలు, పాణ్యం నియోజకవర్గాలకు సంబంధించిన మాక్ పోల్ ప్రక్రియను సోమవారం ఉదయం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.జి.సృజన పరిశీలించారు. ఉదయం 5.30 గంటలకు స్థానిక కింగ్ మార్కెట్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలోని 197, 198, 199, 200, 201 పోలింగ్ కేంద్రాల్లో, ఉదయం 6.10 గంటలకు పాణ్యం నియోజకవర్గానికి సంబంధించి నగరంలోని కేంద్రీయ విద్యాలయంలోని 197, 195ఏ, 195 పోలింగ్ కేంద్రాల్లో నిర్వహిస్తున్న మాక్ పోల్ ప్రక్రియను ఆమె పరిశీలించారు.

పాణ్యంలో ప్రశాంతం

చెదురుమదురు ఘటనలు మినహా..

కర్నూలు/కల్లూరు, మే 13: పాణ్యం నియోజకవర్గంలో ఈసారి ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా సాగింది. చెదురుమొదురు ఘటనలు మినహాయించి ఎక్కడా ఘర్షణ వాతావరణం తలెత్తలేదు

● కల్లూరు అర్బన్ వార్డుల్లో భాగంగా కేంద్రీయ పాఠశాల వద్ద 9 బూత్‌లు ఉండగా.. ఉదయం నుంచే ఓటర్లు బారులు తీరారు. ఇనయత్‌నగర్, టెలికామ్‌నగర్, మారుతి మెగాసిటీ, ధనలక్ష్మి నగర్ తదతర కాలనీలకు చెందిన 19, 20 వార్డులకు సంబంధించిన పోలింగ్ ప్రక్రియ సాగింది.

● బిషప్ చర్చి ప్రాంగణంలో ఉన్న పోలింగ్ బూత్‌లో ఓటరు ప్రక్రియ సజావుగా సాగింది. ఉదయం అంతా ఓటర్లు కిటకిటలాడగా.. మధ్యాహ్నం 3గంటలకే క్యూలైన్లు అన్నీ ఖాళీగా కనిపించాయి.

● కేంద్రీయ విద్యాలయంలో ఉన్న పోలింగ్ బూత్‌ల వద్ద సాయంత్రం కొద్దిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కాటసాని శివనరసింహారెడ్డితో పాటు, గౌరు తనయుడు గౌరు జనార్దన్ రెడ్డి ఇద్దరు ఒకేసారి పోలింగ్ కేంద్రాలకు రావడంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

● అరోరా నగర్‌లో ఉన్న 21వ వార్డు పోలింగ్ బూత్‌లో వైసీపీ నాయకులు హల్‌చల్ చేశారు. వైసీపీ కార్పొరేటర్ అరుణ, ఆమె భర్తతో పాటు పలు నాయకులు పోలింగ్ బూత్‌లోనే తచ్చాడుతూ ఓటర్లను ప్రభావితం చేసే విదంగా ప్రవర్తించారు.

● శరీన్‌నగర్ ప్రాంతంలో ఠాగూర్ విద్యానికేతన్‌లో 5 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. ఇక్కడున్న పరిస్థితుల దృష్ట్యా పోలింగ్ మందకొడిగా సాగింది. క్యూలైన్లు కదలకపోవడంతో ఓటర్లు కొంత అసౌకర్యానికి గురయ్యారు. అలాగే శరీన్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

● వీకర్‌సెక్షన్ కాలనీలో 41వ వార్డులోని పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్యే తనయుడు కాటసాని శివనరసింహారెడ్డి అక్కడకు వెళ్లడంతో కొంత ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. టీడీపీ నాయకుడు ఓ ఏజెంటుతో ఆయన కొంత దురుసుగా ప్రవర్తించినట్లు వార్తలు రావడంతో పోలీసులు సర్ది చెప్పి బయటకు పంపారు.

● కల్లూరు మండలం చిన్నటేకూరు పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో గ్రామస్థులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. పెద్దపాడులో పోలింగ్ బూత్ 9లో గంట ఆలస్యంగా పోలింగ్ ప్రక్రియ సాగింది.

● ఓటు హక్కును వినియోగించుకున్న గౌరు దంపతులు: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గౌరు చరితమ్మ, ఆమె భర్త గౌరు వెంకటరెడ్డి సెయింట్ జోసెఫ్ పాఠశాలలోని 168 పోలింగ్ బూత్‌లో ఓటు వేశారు.

కోడుమూరు(రూరల్): సార్వత్రిక ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఓటర్లు బారులు తీరారు. ఉదయం 7 గంటల నుంచే కేంద్రాల వద్దకు ఓటర్లు పోటెత్తారు. లద్దగిరి, అనుగొండ, వర్కూరు, పులకుర్తి, ప్యాలకుర్తి, గోరంట్ల, అమడగుంట్ల వంటి గ్రామాల్లో కేంద్రాల వద్ద కిక్కిరిసిపోయారు. వృద్ధులు సైతం ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొనడం విశేషం.

● అనుగొండలో స్వల్ప వాగ్వాదం: అనుగొండలో ఓటింగ్ కేంద్రం వద్ద వైసీపీ, టీడీపీ కార్యకర్తల నడుమ స్వల్ప వాగ్వాదం జరిగింది. సర్పంచ్ మాద మ్మ పోలింగ్ కేంద్రం వద్ద చాలా సమయం నుంచి కూర్చుని ఉండడంతో టీడీపీ కార్యకర్తలు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో కల్పించుకున్న వైసీపీ వర్గీయులు ఓటు వేయడానికి సర్పంచ్ వచ్చినట్లు తెలిపారు. అయితే ఓటు వేయకుండా ఎంతసేపని కూర్చుంటారని, పైగా ఓటు వేయడానికి వచ్చే మహి ళలతో సర్పంచ్ మాట్లాడుతూ ప్రభావితం చేస్తున్నారని టీడీపీ కార్యకర్తలు ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కల్పించుకుని సర్పంచ్‌ను అక్కడి నుంచి బయటకు పంపారు.

ఓర్వకల్లులో వర్షం

ఉపశమనం పొందిన ప్రజలు

ఓర్వకల్లు, మే 13: మండల కేంద్రమైన ఓర్వకల్లులో ఒక పక్క ఎన్నికలు, మరో పక్క గాలివాన బీభత్సంతో ప్రజలు, ఓటర్లు తల్లడిల్లారు. ఓట్లు వేసేందుకు ప్రజలు బారులు తీరగా.. సాయంత్రం భారీ వర్షం కురవడంతో ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందారు. దీంతో విద్యుత్ సరఫరాకు కాస్త అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.

సి. బెళగల్‌లో ..

సి.బెళగల్: మండలంలోని గ్రామాల్లో ఆదివారం అర్ధరాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఆయా గ్రామాలలోని చెట్లు, విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయి. విద్యుత్ అధికారులు యుద్ధ ప్రాతి పదిక పనులు చేపట్టి విద్యుత్‌ను పునరుద్ధరించారు.

అధికారులకు ధన్యవాదాలు

కర్నూలు(అర్బన్), మే 13: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించిన కలెక్టర్, ఎస్పీలకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కే. బాబురావు ధన్యవాదాలు తెలిపారు. సోమవారం పోలింగ్‌లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు. పోలింగ్ సిబ్బందికి, పోలీసులకు, రాజకీయ పార్టీల నాయకులకు, కార్యకర్తలకు, జిల్లా ప్రజలకు ఆయన అభినందనలు తెలిపారు.

సొంత ఊర్లకు బారులు తీరిన ఓటర్లు



కర్నూలు(అర్బన్), మే 13: ఎన్నికల్లో ఓట్లు వేసేందుకు ఓటర్లు బస్సులు, వాహనాల కోసం కూడళ్లలో ఎదురు చూస్తు కనిపించారు. సోమవారం ఉద యం నుంచి నంద్యాల చెక్ పోస్టు, గుత్తి పెట్రోల్ బంక్ ప్రాంతాల్లో పట్టణాలు, గ్రామాలకు తరలివెళ్లేందుకు ప్రయాణికులతో బస్టాప్‌లు కిక్కిరిసి కనిపిం చాయి. కనిపించిన ప్రతి వాహనాన్ని ఆపే ప్రయత్నం చేస్తూ ఇబ్బందులు పడ్డారు. నంద్యాల చెక్ పోస్టు వద్ద నంద్యాల, నందికొట్కూరు పరిధిలోని గ్రామాలకు వెళ్లేందుకు బస్సులు, ఆటోలు లేకపోవడంతో గంటల తరబడి పడి గాపులు కాశారు. మరికొందరు ద్విచక్ర వాహనాల్లో ఊర్లకు వెళ్లారు. ఈ సారి ఎన్నికల్లో ప్రజలు ఓట్లు వేసేందుకు ఆయా ప్రాంతాలకు వెళ్లేందుకు కనిపిం చడం విశేషం.

ప్రశాంతంగా పోలింగ్

● మొరాయించిన ఈవీఎంలు
● ఎండలో ఇబ్బందులు పడిన ఓటర్లు





ఓర్వకల్లులో ఓటు కోసం క్యూలో నిల్చున్న ఓటర్లు



సి బెళగల్‌లో..

కర్నూలు(న్యూసిటీ), మే 13: కర్నూలు అసెంబ్లీ పరిధిలో సోమవారం జరిగిన ఎన్నికల పోలింగ్ ప్రశాతంగా ముగిసింది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం 2 గంటల వరకు మందకొడిగా సాగింది. ఒకటి రెండు పోలింగ్ కేంద్రాలలో ఈవీఎంలు మొరాయించ డంతో పావుగంటలో మరో ఈవీఎంను ఏర్పాటు చేశారు.

ఈవీఎంల మొరాయింపు

అసెంబ్లీ పరిధిలో 18వ పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మొరాయించడంతో తక్షణమే మరో ఈవీఎంను తెప్పి ంచారు. కొత్తపేట 171 పోలింగ్ బూత్‌లో ఈవీఎం పనిచేయకపోవడంతో అరగంట సేపు ఓటర్లు బయట ఎండకి నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు హుటాహుటిన ఉన్నతాధికారులు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో అరగంట తరువాత మరో ఈవీఎంను తీసుకువచ్చారు. అప్పటికే ఉక్కపోతకు తట్టుకోలేక కొందరు బయటికి వచ్చి చెట్ల కింద సేదతీరారు.

వన్‌టౌన్‌లో ఓటర్ల ఇబ్బందులు

వన్‌టౌన్ సమీపంలో కొన్ని పోలింగ్ బూత్‌లు ప్రధాన రహదారులకు అనుకుని ఏర్పాటు చేశారు. అంతేకాకుండా పోలింగ్ కేంద్రం చిన్నదిగా ఉండటంతో ఓటర్లు అంతా రోడ్లపైనే నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. ఒకటో వార్డులో సిరాక్ పాఠ శాలలో 190,191,192,195, 196 పోలింగ్ కేంద్రాలను ఒకే చోట ఏర్పాటు చేశారు. గత కార్పొరేషన్ ఎన్నికల్లో నెహ్రూ మెమోరియల్ పాఠశాలలో 10 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం నెహ్రూ మెమోరియల్ పాఠశాలలో కేవలం 5 మాత్రమే పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. సిరాక్ పాఠశాలలో 3, మున్సిపల్ ఎలిమెంట్రీ ప్రైమరీ పాఠశాలలో 2 బూత్‌లను ఏర్పాటు చేయకుండా అధికారులు అలసత్వం వహించారు. దీంతో ఒకేచోట 5 పోలింగ్ బూత్‌లు ఉండటంతో ఓటర్లు రోడ్లపైన నిలబ డాల్సిన పరిస్థితి నెలకొంది.

పోలింగ్ బూత్‌లో వలంటీర్.. అడ్డుకున్న టీడీపీ కార్పొరేటర్

ఉస్మానియా కళాశాలలోని 129 పోలింగ్ బూత్‌లో వైసీపీ నాయకులు వలంటీరును ఏజెంటుగా కూర్చోబెట్టారు. దీంతో టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. వలంటీర్ రాజీనామా చేస్తేనే ఏజెంటుగా కూర్చోవాలని 8వ వార్డు టీడీపీ కార్పొరేటర్ కురువ పరమేష్ అధికారులను ప్రశ్నించారు. అయితే వలంటీర్ రాజీనామా చేసినట్లు వైసీపీ నాయకులు తనకు చెప్పా రని అధికారి తెలిపారు. ఈ క్రమంలో రాజీనామా పత్రాన్ని చూపించాలని కార్పొరేటర్ అడగడంతో వలంటీర్ అక్కడి నుంచి వెళ్లిపోయింది.

మొదటి సారి ఓటు హక్కు వినియోగించుకున్న యువత

సార్వత్రిక ఎన్నికల్లో యువత మొట్టమొదటి సారి ఓటు హక్కు వినియోగంచుకున్నారు. మొత్తం 258 పోలింగ్ బూత్‌లలో సుమారు వెయ్యి మంది ఓటు హక్కు వినియోగించుకునట్లు అధికారులు తెలిపారు.

ఓటు హక్కు వినియోగించుకున్న టీజీ కుటుంసభ్యులు

నగరంలోని ఎన్‌ఆర్‌పేట శ్రీలక్ష్మీ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి టీజీ వెంకటేష్ దంపతులు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

140 పోలింగ్ బూత్‌లో దొంగ ఓట్లు..

నగరంలోని ఉస్మానియా కళాశాలలోని 140 పోలింగ్ బూత్‌లో వైసీపీ నాయకులు దొంగ ఓట్లు వేయించారు. ముస్లిం మహిళలను తీసుకుని వచ్చి దొంగ ఓట్లు వేయిస్తుండటంతో అక్కడే ఉన్న టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. టీడీపీ నాయకులు ప్రిసైడింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు. తక్షణమే వైసీపీ నాయకులు వేయించిన దొంగ ఓట్లను తొలగించాలని డిమాండ్ చేశారు. ముస్లిం మహిళలు బురఖా తీసి ఓటు వేసే విధంగా చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు, ఏజెంట్లు ప్రిసైడింగ్ అధికారికి విజ్ఞప్తి చేశారు. చివరికి టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ పోలింగ్ బూత్‌లోకి వెళ్లి ప్రిసైడింగ్ అధికారితో మాట్లాడారు. దొంగ ఓట్లను మీరైనా కట్టడి చేయండి..లేని పక్షంలో పోలింగ్‌ను నిలిపేయాలని కోరారు.

ఇదే ప్రాంగణంలో మరో బూత్‌లో ఇదే తంతు జరిగుతుంటే టీడీపీ నాయకులు మంజునాథ్ అడ్డుకున్నారు. దీంతో వైసీపీ నాయకులు, కార్యక ర్తలు మంజునాథ్‌ను చుట్టుముట్టారు. ఈ క్రమంలో పోలీసులు వచ్చి వైసీపీ నాయకుడిని అదుపులోకి తీసుకుని జీపులో తీసుకెళ్తుండగా వైసీపీ నాయకులు వాహనాన్ని అడ్డుకున్నారు. దీంతో పోలీసులు స్వల్ప లాఠీచార్జీ చేసి వైసీపీ నాయకులకు చెదరగొట్టారు.

130 పోలింగ్ బూత్ వద్ద సొమ్మసిల్లి పడిన వృద్ధుడు

ఉస్మానియా కళాశాల మైదానంలోని 130 పోలింగ్ బూత్ వద్ద ఓ వృద్ధుడు కళ్లుతిరిగి ఒక్కసారిగి కుప్పకూలిపోయాడు. దీంతో పక్కనే ఉన్న వాళ్లు అతడిని పైకి లేపి కాస్త నీరు తాగించి పక్కనే కూర్చోబెట్టారు. ఈ క్రమంలో మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్న ఆశా వర్కర్, ఏఎన్‌ఎంలు వచ్చి ఆ వృద్ధుడికి ఓఆర్‌ఎస్ నీరు తాగించి పోలింగ్ బూత్‌లోకి పంపించారు.

గూడూరు: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. సోమవారం గూడూరు మండలంలో 40 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల పక్రియ కొనసాగింది. మండలంలో పురుషలు ఓటర్లు 18,304, స్త్రీ ఓటరు 18,537, థర్డ్ జెండర్లు ఇద్దరు, మొత్తం ఓటర్లు 36,843 ఉన్నారు. పోలింగ్ 7గంటలకు ప్రారంభం కాగా గూడూరులోని 177 పోలింగ్ కేంద్రంతో పాటు మండలంలోని మునగాల గ్రామంలోని 134 పోలింగ్ కేంద్రంలో కూడా ఈవీఎం మొరాయించింది. దీంతో ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి వచ్చిన ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. పోలింగ్ కేంద్రంలోని అధికారులు విషయాన్ని ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లాడంతో వారు అక్కడకు చేరుకోని మరొక ఈవీఎంను ఏర్పాటు చేశారు. అలాగే జులకల్ గ్రామంలోని 164 పోలింగ్ కేంద్రంలో కూడా కొద్ది సేపు ఈవీఎం మొరా యించింది. గూడూరు, మునగాల గ్రామాల్లో ఈవీఎంలు మొరాయిం చడంతో ఓటర్లు ఆరు గంటలు దాటిన కూడా క్యూలైన్లల్లో నిలుచోని ఓటు హక్కును వినియోగించుకోన్నారు.

గూడూరులో పోలింగ్ సరళిని టీడీపీ నాయకులు నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ కురుకుంద రామాంజనేయులు, రేమట వెంకటేశ్వర్లు సోమవారం పరిశీలించారు.

ఓటు వేసిన టీజీ భరత్

కర్నూలు(అర్బన్): కర్నూలు తెలుగుదేశం పార్టీ అభ్యర్థి టీజీ భరత్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సోమవారం ఉదయం నగరం లోని ఎన్‌ఆర్ పేట శ్రీలక్ష్మి స్కూల్‌లో క్యూలో నిలబడి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థికి ఓటు వేశారు. వార్డు పరిధిలో ప్రశాంతంగా ఓటు హక్కును ఓటర్లు సద్విని యోగం చేసుకున్నారన్నారు.

ఓటు వేసిన కాంగ్రెస్ అభ్యర్థులు

కర్నూలు(అర్బన్): కాంగ్రెస్ పార్టీ తరఫున సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన ఇద్దరు అభ్యర్థులు కర్నూలు నగరంలో ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. నంద్యాల కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జె.లక్ష్మీ నరసింహ యాదవ్ కల్లూరు మండలంలోని కేంద్రీయ విద్యాలయంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా కర్నూలు ఎంపీ అభ్యర్థి లక్కీటు రాంపుల్లయ్య యాదవ్, కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ జిలానిలు తమ ఓటు ఆయా వార్డుల్లోని బూతుల్లో వేశారు.

ఓర్వకల్లు: మండలంలో సోమవారం జరిగిన ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. దీంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. ఓటర్లు ఉద యం 6.30 గంటలకే పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకుని క్యూలో నిల్చున్నారు. ఎండలు సైతం లెక్కచేయకుండా ఓటర్లు మధ్యాహ్నం వరకు ఉండి ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం సాయంత్రం వర్షం పడినా ఓటర్లు క్యూలో నిల్చుండి తమ ఓటును వేసారు. అయితే.. హుశేనాపురం, పూడిచెర్ల గ్రామాల్లో కొద్దిగా ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. దీంతో పోలీసులు జోక్యం చేసుకోవడం సర్దుమణిగింది. ఎన్.కొంతలపాడు, ఉప్పలపాడు తదితర గ్రామాల్లో ఈవీఎంలు కొద్దిసేపు మొరాయించడంతో మళ్లీ పని చేశాయి. అయితే సాయంత్రం 6 గంటలు దాటిన తర్వాత ఓర్వకల్లు, నన్నూరు, ఉప్పల పాడు, హుశేనాపురం, పూడిచెర్ల తదితర గ్రామాల్లో ఓటు హక్కును వినియో గించుకున్నారు. వృద్ధులను మూడుచక్రాల బండిపై తీసుకువచ్చి ఓటును వేయించారు. హుశేనాపురం గ్రామంలో నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ కుటుంబ సభ్యులతో కలిసి తన ఓటు హక్కును వినియోగించు కున్నారు. హుశేనాపురం పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్యే కాటసాని అనుచరుడు ఏజెంటుగా ఉండటంతో కొద్దిసేపు వైసీపీ, టీడీపీ వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో పోలీసులు ఆ ఏజెంటును పంపించేయడంతో ఘర్షణ సర్దుమ ణిగింది. పూడిచెర్ల గ్రామంలో వైసీపీ, టీడీపీ మధ్య ఘర్షణ చోటు చేసుకో వడంతో టీడీపీ వర్గానికి చెందిన ఇద్దరు వ్యక్తులను సీఐ కిరణ్‌కుమార్ రెడ్డి అదుపులోకి తీసుకొని ఓర్వకల్లు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మల్లెల రాజశేఖర్ మాట్లాడుతూ పోలీసులు వైసీపీకి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా సీఐ కిరణ్ కుమార్ రెడ్డి, ఎస్‌ఐ రాజారెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.



మల్లెల రాజశేఖర్



రాంపుల్లయ్య యాదవ్



జిలానీ బాషా

ఓటు హక్కు వినియోగించుకున్న బొగ్గుల దస్తగిరి

కర్నూలు(రూరల్): కోడుమూరు టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి తన స్వగ్రామమైన పసుపులలో ఓటు హక్కును వినియోగించు కున్నారు. అనంతరం ఆయన నియోజకవర్గంలో పర్యటించి గ్రామాల్లో జరుగుతున్న పోలింగ్ సరళిని పరిశీలించారు. గెలుపు టీడీపీదే అని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

మొరాయించిన ఈవీఎంలు

సి.బెళగల్: మండలంలోని కోటగడ్డ, మారందొడ్డి, సంగాల, తిమ్మనదొడ్డి, బురాన్‌దొడ్డి గ్రామాలలో ఈవీఎంలు మొరాయించడంతో ఓటర్లు ఓటు వేయడానికి బారులు దీరారు. రూట్ ఆఫీసర్లు ఆదాంబాషా, సందీప్ మొరాయించిన ఈవీఎంల స్థానాల్లో కొత్తవాటిని ఏర్పాటు చేశారు. అనంతరం పోలింగ్ యధావిధిగా కొనసాగింది. దీంతో పోలింగ్ కేంద్రాల దగ్గర ఓటర్లు బారులు దీరాలు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన: మండలంలోని పోలకల్లు, గొల్లలదొడ్డి, కంబంధహల్, ముడుమాల, కొత్తకోట గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను కర్నూలు డీఎస్పీ విజయకుమార్, స్పెషల్ పార్టి డీఎస్పీ అనుమంతరావు పరిశీలించారు. ఈసందర్భంగా డీఎస్పీ విజయకుమార్ మాట్లాడుతూ ఓటర్లుకు అసౌకర్యాలు కలగకుండ ఎండలో నిలబడి ఓటర్ల కోసం షామియానలు ఏర్పాటు చేయించి, తాగునీరు, మెడికల్ వాళ్లను అందుబాటులో ఉండాలని ఆదేశించారు. వారి వెంట కోడుమూరు సీఐ మన్సురుద్దీన్, ఎస్ఐ తిమ్మారెడ్డి ఉన్నారు.



ప్రభుత్వ బాలుర పాఠశాలలో..



జొహరాపురంలో..



గూడూరులో పోలింగ్ కేంద్రాల వద్ద బారులుదీరిన ఓటర్లు



కేంద్రీయ విద్యాలయంలో ఓటర్లకు అభివాదం చేస్తున్న నంద్యాల కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జె.లక్ష్మీనరసింహ యాదవ్



కర్నూలు నగరంలోని రోజా వీధిలో ఓటు హక్కు వినియోగించుకున్న మీసాల సుమలత తదితరులు







బీ క్యాంప్ మున్సిపల్ హైస్కూల్లో..

ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు ● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

వెల్లివిరిసిన చైతన్యం


మంత్రాలయంలో ఓటేసేందుకు క్యూలో నిల్చున్న ఓటర్లు


మద్దికెరలో..


కోసిగిలో..


బూదూరులో సాయంత్రం 6 గంటలైనా తగ్గని క్యూ

- పోలింగ్ ప్రశాంతం
- పలు కేంద్రాల్లో మొరాయించిన ఈవీఎంలు
- పట్టణ ఓటర్లలో నిర్లిప్తత.... పల్లెల్లో హుషారు
- కొన్ని ప్రాంతాల్లో నేతల మధ్య తోపులాటలు
- చెదురుముదురు ఘటనలు మినహా ప్రశాంతం

ఆదోని/ఎమ్మిగనూరు/మంత్రాలయం/పత్తికొండ/ఆలూరు, మే 13: ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ, మంత్రాలయం, ఆలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7 గంటల నుంచి ప్రారంభమైన పోలింగ్. సాయంత్రం 6 గంటలకు ముగిసింది. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో 6 గంటలలోపు కేంద్రాలకు చేరుకున్న ఓటర్లకు ఆపై సమయంలో కూడా ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల అధికారులు కల్పించారు. ఓటర్లు ఇచ్చిన తీర్పుతో అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమైంది. ఈవీఎంలను కర్నూలులోని రాయలసీమ యూనివర్సిటీ స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. జూన్ 4న ఫలితాలు వెల్లడి కానున్నాయి. ఓటర్ల అభ్యర్థన కార్యక్రమాలు, ప్రచారాలతో అలసిన అభ్యర్థులు.. 21 రోజులు రిలాక్స్ అవుతున్నారు. చాలా మందికి వారి నివాసిత ప్రాంతంలో కంటే దూరంలో ఓటర్లుగా నమోదు కావడం, పోలింగ్ సెంటర్లకు వెళ్లిన కొందరు ఓటు లేకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. చెదురు ముదురు సంఘటనలు మినహా మొత్తంగా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఇక అభ్యర్థులు ఎవరికి వారు గెలుపు ధీమాను వ్యక్తం చేశారు. పోలింగ్ సెంటర్లలోకి సెల్‌ఫోన్‌లను అనుమతించలేదు. దీంతో ఓటర్లు వాటిని బయటే పెట్టి సెంటర్‌లోకి వెళ్లారు.

ఎమ్మిగనూరులో 79.85 శాతం పోలింగ్ : నియోజకవర్గంలోని ఎమ్మిగనూరు పట్టణం, మండలం, నందవరం, గోనెగండ్ల మండలాల్లో పోలింగ్ ప్రశాంగా ముగిసింది. ఉదయం 7గంటలకు ప్రారంభమైన ఓటింగ్ రాత్రి పొద్దుపోయే వరకు కొనసాగింది. నియోజకవర్గంలో మొత్తం 2,47,752 మంది ఓటర్లు ఉన్నారు. వీరు ఓటు వేసేందుకు 272 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. 79.85 శాతం ఓట్లు నమోదయ్యాయి. టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు

పత్తికొండ నియోజకవర్గంలో 79.10 శాతం పోలింగ్ : నియోజకవర్గంలో మొత్తం 5మండలాలు ఉండగా 2,23,603 మంది ఓటర్లు ఉన్నారు. 255 పోలింగ్‌కేంద్రాలు ఉండగా 27 రూట్లను ఏర్పాటుచేసి అధికారులు ఎన్నికలను పర్యవేక్షించారు. నియోజకవర్గపరిధిలో మొత్తం 79.10 శాతం పోలింగ్‌నమోదు అయిందని ఆర్వో రామలక్ష్మి తెలిపారు. వెల్దుర్తి మండలం మల్లెపల్లె గ్రామంలో టీడీపీ మద్దతుదారుడు భాష్యంరాజుపై వైసీపీ కార్యకర్తలు ఐదుగురు దాడిచేయడంతో ఆయన తలకు గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేశారు.

మంత్రాలయం నియోజకవర్గంలో 82.50 శాతం పోలింగ్ : నియోజకవర్గంలో 237 పోలింగ్ కేంద్రాల్లో 82.50 శాతం పోలింగ్ నమోదైనట్లు ఆర్వో మురళితెలిపారు. డీఎస్పీ సీతారామయ్య పర్యవేక్షణలో ఆరుగురు సీఐలు,10 మంది ఎస్‌ఐలు, 150 మంది ఏఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, 100 మంది హోంగార్డులు, 100 మంది కేంద్ర బలగాలతో పోలిసు బందోబస్తు చేపట్టారు. 1528 మంది పీవోలు, ఏపీవోలు, ఓపీవోలు సిబ్బందితో 19 మంది మైక్రో అబ్జర్వర్ల మధ్య పోలింగ్ ప్రశాంతంగా ముగిగిసింది.

ఆలూరులో 77.71 శాతం పోలింగ్ : నియోజకవర్గంలోని 6 మండలాల్లో మొత్తం 2,58,997 ఓట్లు ఉండగా, రాత్రి 9.30 నిమిషాల సమయానికి 2,01,265 ఓట్లు పోలైయ్యాయని, 77.71 శాతంగా నమోదు అయ్యిందని ఆలూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి రామునాయక్ తెలిపారు. దేవనకొండ మండలంలో రెండు కేంద్రాల్లో పోలింగ్ పూర్తి కాలేదని, దీంతో పోలింగ్ శాతం మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపారు.

వైసీపీ నాయకుల దౌర్జన్యం: ఆలూరు మెయిన్ స్కూల్‌లో వైసీపీ మూకలు టీడీపీ నాయకులపై దౌర్జన్యానికి పాల్పడ్డారు. దీంతో ఇరువురి మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటు చేసుకుంది. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్ ఇరువురికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. గుంతకల్ రైల్వే డీఎస్పీ చాముండేశ్వరి, ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు, తన సిబ్బందితో వచ్చి అందరినీ చెదరగొట్టి లాఠీచార్జి చేయడంతో ప్రశాంతంగా పోలింగ్ సాగింది.

● మొరాయించిన ఈవీఎంలు...


హొళగుందలోని 37వ పోలింగ్ కేంద్రం వద్ద ఈవీఎంలు గంటన్నర పైగా మొరాయించడంతో కింద కూర్చున్న ఓటర్లు

ఆదోని/హొళగుంద/ఆస్పరి/హాలహర్వి/ మద్దికెర / పెద్దకడబూరు: పట్టణంలోని మల్లికార్జున విద్యాలయం, శంకర్ నగర్, బాలికల కళాశాల, కల్లుబావిలో ఈవీఎం మిషన్‌లు మొరాయించాయి. ఉదయం 7 గంటలకు ప్రారంభం కావాల్సిన ఎన్నికలు, ఈవీఎం మిషన్ మొరాయించడంతో గంట తర్వాత ఎన్నికల అధకారులు ఈవీఎంను సరిచేశారు. హొళగుంద మండల పరిధిలోని పెద్దగోనేహాల్‌లోని 40 పోలింగ్ కేంద్రం, పెద్దహ్యాటలోని 32, హొళగుందలోని 37, ముదటమాగిలోని 7వ పోలింగ్ కేంద్రంలో ఈవీఎంలు మొరాయించాయి. హొన్నూరులోని 4వ పోలింగ్ కేంద్రంలో నూతన ఈవీఎంను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ ఎం ప్రసాద్ రాజు తెలిపారు. ఆస్పరి మండల పరిధిలోని కైరుప్పలలో 217 పోలింగ్ కేంద్రం, బిల్లేకల్ 211వ పోలింగ్ కేంద్రం, ములుగుందంలోని 229వ పోలింగ్ కేంద్రాలలో ఈవీఎంలు మొరాయించాయి. దీంతో మూడు గంటలకు పైగా ఓటర్లు ఓటు వేసేందుకు ఎదురుచూడాల్సి వచ్చింది. హాలహర్వి మండలం కొక్కరచేడు గ్రామంలో విద్యుత్ సౌకర్యం లేక ఓటింగ్ నిలిచి పోయింది. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు విద్యుత్ సమస్య పరిష్కరించారు. చింతకుంట గ్రామంలో సైతం ఈవీఎంలు మొరాయించాయి. మద్దికెర మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలో ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ ప్రక్రియ ఆలస్యమైంది. పెద్దకడబూరు మండలంలో 19 బూత్‌లలో దాదాపు 8గంటల వరకు ఓటింగ్ ప్రక్రియ కొనసాగింది. కల్లుకుంట, గవిగట్టు, చిన్నతుంబళంలో గంటపాటు ఈవీఎంలు మొరాయించాయి.

మద్దికెరలో 94 ఏళ్ల వృద్ధురాలు ఓటు


సరోజమ్మ (94)

మద్దికెర, మే 13: మండలంలోని ఎం.అగ్రహారం గ్రామంలో ఊటకూరు సరోజమ్మ (94) వృద్ధురాలు పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల అధికారులు వయోభారం మీద పడినవారికి ఇంట్లోనే ఓటు హక్కు కల్పించినప్పటికీ ఈ వృద్ధురాలు పోలింగ్ కేంద్రంలోనే ఓటు వేయాలనే ఉద్దేశంతో తన కుమారుడు రిక్విత్ రెడ్డి సాయంతో పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేయడం విశేషం.

ఎమ్మిగనూరులో భారీ వర్షం

ఎమ్మిగనూరు రూరల్, మే 13: ఎమ్మిగనూరు పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం తెల్లవారుజామున ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. తెల్లవారు జామున దాదాపు మూడు గంటలకు ప్రారంభమైన వాన ఉదయం 7గంటల వరకు వర్షం కురిసింది. దీంతో వంకలు, వాగులు పొంగిపొర్లాయి. పట్టణంలోని ప్రధాన రహదారులు, లోతట్టు కాలనీలు జలమయమయ్యాయి. మురుగు కాలువలు పొంగిపొర్లాయి. గాంధీనగర్‌లోని మీసేవా కేంద్రం ఆవరణంలో ఉన్న భారీ వృక్షం ఈదురు గాలులకు నేలకూలింది. అలాగే మండల పరిధిలోని సిరాలదొడ్డి, కడిమెట్ల, కడివెళ్ల, కందనాతి, గుడికల్లు, గార్లదిన్నె, పార్లపల్లి, పెసలదిన్నె, దైవందిన్నె, కలుగొట్ల తదితర గ్రామాల్లోని పంట పొలాలు వర్షపు నీటితో మునిగాయి. వర్షపునీటితో వంకలు నిండిపోయాయి.

మద్దికెర : మండలంలోని మద్దికెర, బురుజుల, ఎం.అగ్రహారం తదితర గ్రామాల్లో సోమవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. వ్యవసాయ పనులు, ఉపాధి పనులు వర్షం కారణంగా రద్దు కావడంతో ఓటింగ్‌కు ఓటర్లు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మండలంలోని బురుజుల గ్రామంలో శుద్ధబాయి వంక భారీ వర్షం కారణంగా రెండు గంటల పాటు పొంగిపొర్లడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది.

టీడీపీ కార్యకర్త పై వైసీపీ కార్యకర్తల దాడి


పరిస్థితిని సమీక్షిస్తున్న పోలీసులు

వెల్దుర్తి, మే, 13 : మండలంలో మల్లెపల్లె గ్రామంలో టీడీపీ కార్యకర్త భాష్యం రాజు పై వైసీపీ కార్యకర్తలు సోమవారం కర్రలతో దాడి చేసి గాయపరిచారు. భాష్యం రాజు ఉద్యోగరీత్యా హైదరాబాదులో ఉంటున్నాడు. సొంతూరు మల్లెపల్లెలో ఓటు హక్కు వినియోగించుకోవడానికి వచ్చాడు. ఓటు హక్కు వినియోగించుకొని తన చిన్నాన్న ఇంటికి వెళ్లాడు. వైసీపీ కార్యకర్తలు ప్రచారం చేస్తున్నాడనే నెపంతో కర్రలతో దాడిచేశారు. సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి గ్రామానికి చేరుకొని కేసు నమోదు చేశారు.

చిప్పగిరిలో 80 శాతం పోలింగ్

చిప్పగిరి, మే 13: చిప్పగిరి మండలంలో 80 శాతం పోలింగ్ నమోదయింది. మండలంలో 24,772 ఓటర్లు ఉండగా మంది 20,109 ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలోని 16 గ్రామాల్లోని 29 పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. గుంతకల్ రైల్వే ఎస్పీ చాముండేశ్వరి చిప్పగిరి మండలంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. సోమవారం ఉదయం వర్షం కురవడంతో వాతావరణం చల్లగా ఉన్నందువల్ల ఓటర్లు పోటెత్తారు. వైకాపా అభ్యర్థి విరుపాక్షి ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి ఆరకట్ల నవీన్ కిషోర్ బెల్లడోణ ఉన్న ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఓటు వేశారు. టీడీపీ అభ్యర్థి వీరభద్ర గౌడ్ చిప్పగిరి, ఏరూరు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

ఓటు వేసేందుకు వచ్చిన బాలింతకు నిరాశే...

● తన కంటే ముందే ఎవరో ఓటు వేశారని డీఎస్పీకి ఫిర్యాదు



ఆదోని (అగ్రికల్చర్), మే 13: ఆదోని పట్టణంలోని ఆర్లయ్య వీధిలోని ఆదిఆంధ్ర ప్రభుత్వ పాఠశాల పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు వచ్చిన బాలింత లక్ష్మికి నిరాశ ఎదురైంది. చంటి బిడ్డను ఇంట్లో వదిలి ఓటు వేయాలని సంకల్పంతో పోలింగ్ కేంద్రానికి వస్తే, అప్పటికే తన ఓటు ఎవరో వేశారని పోలింగ్ సిబ్బంది వెనక్కి పంపారు. తాను ఓటే వేయలేదని, ఎవరో తన ఓటు ఎలా వేస్తారని పోలింగ్ సిబ్బందితో వాగ్వాదానికి దిగింది. పోలీసులు, పోలింగ్ సిబ్బంది బయటకు వెళ్లాలని సూచించడంతో అప్పుడే పోలింగ్ కేంద్రానికి వచ్చిన డీఎస్పీ శివ నారాయణస్వామికి తన ఓటు ముందే ఎవరో వేశారని, ఎలా వేస్తారు...? అంటూ ప్రశ్నించారు. బాలింతగా తాను ఓటు వేసేందుకు వస్తే ఇలా ఓటును ఎవరి చేతనో వేయించడం మంచిది కాదని వాపోయింది. తనకు ఓటు హక్కు కల్పించాలని కోరింది. డీఎస్పీ పోలింగ్ సిబ్బందితో మాట్లాడతానని అక్కడ నుంచి జారుకున్నారు. ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తానని తెలిపింది.

మంత్రాలయంలో ఓటేసిన ప్రముఖులు


కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీకృష్ణంరాజుదొర, రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు, వైసీపీ అభ్యర్థి బాలనాగిరెడ్డి

మంత్రాలయం, మే 12: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్.రాఘవేంద్రరెడ్డి మాధవరం గ్రామంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు మంత్రాలయంలో ఓటు వేశారు. ప్రస్తుత ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి వై.బాలనాగిరెడ్డి కాచాపురంలో తన భార్య సర్పంచు జయమ్మతో వెళ్లి ఓటేశారు. కోసిగిలో కాంగ్రెస్ అభ్యర్థి మురళికృష్ణంరాజు దొర ఓటును వినియోగించుకున్నాడు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన ఓటింగ్ సరళిని బట్టి గెలుపుపై ఎవరి ధీమా వారు వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి నియోజకవర్గంలో టీడీపీ అఖండ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

రూ.1.86లక్షల నగదు స్వాధీనం

ఎమ్మిగనూరు/టౌన్ , మే 13: ఎమ్మిగనూరు పట్టణ శివారులోని ఆదోని రోడ్డులో అగ్నిమాప కేంద్రం దగ్గర ఎలాంటి ఆధారాలు లేకుండ నగదును తరలిస్తున్న వ్యక్తిపై దాడిచేసి రూ.1.86లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు సెట్ సీఐ భార్గవ్‌రెడ్డి తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు వెంకటాపురం కాలనీకి చెందిన పి. ఆంజనేయులు ఫైర్‌స్టేషన్ దగ్గర ఎలాంటి ఆధారాలు లేకుండ రూ.1.86లక్షల నగదును కలిగి ఉండడంతో ఆ మొత్తాన్ని స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఎస్‌టీ టీం మధుబాబు, వరప్రసాద్, సత్యనారాయణ, హెచ్‌సీ గౌస్‌రబ్బాని, కానిస్టేబుళ్లు భరత్, నరసింహారెడ్డి పాల్గొన్నారు.


ఆదోని మండలంలోని చాగిలో ఓటు వేసేందుకు వస్తున్న వృద్ధురాలు


ఆదోని, కోసిగిలో ఓటు వేసేందుకు క్యూకట్టిన ఓటర్లు


ఆదోని, పత్తికొండలో ఓటువేసేందుకు క్యూలో నిల్చున్న మహిళలు


గోనెగండ్ల 239వ బూత్‌లో ఈవీఎంలు మొరాయించడంతో నిరీక్షణ..


హొళగుందలోని 37వ మోడల్ కేంద్రంలో మహిళలకు బొట్టు పెట్టి, రవిక పెట్టి ఆహ్వానిస్తున్న ఎన్నికల అధికారులు


కడిమెట్లలో ఓటు వేసేందుకు వర్షపునీటిలో నిలబడ్డ ఓటర్లు


గోనెగండ్ల మండలం వేముగోడులో 95ఏళ్ల వృరాలు నాగమ్మ ఓటు వేసేందుకు వస్తున్న దృశ్యం


ఓటు హక్కు వినియోగించుకున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఎమ్మిగనూరు టీడీపీ అభ్యర్థి జయనాగేశ్వరరెడ్డి దంపతులు, వైసీపీ అభ్యర్థి బుట్టారేణుక


ఆదోనిలో మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు, ఆలూరు టీడీపీ అభ్యర్థి వీరభద్రగౌడ్, కాంగ్రెస్ అభ్యర్థి విరుపాక్షి, మంత్రాలయం టీడీపీ అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి, పత్తికొండ టీడీపీ అభ్యర్థి కేఈ శ్యాంబాబు